
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 27 ఫిబ్రవరి 2025 | 5



మండపేట..
ద్వారపూడిలో ఆదియోగి

పిఠాపురం పాదగయకు తరలివచ్చిన భక్తజనం



భక్తజన సందోహం.. పలికెను శివోహం..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు ఓం నమశ్శివాయ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ శివాలయాలు కిటకిటలాడాయి. పాదగయ, ద్రాక్షారామ, సామర్లకోటకు భక్తజనం తరలివచ్చారు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కరఘాట్లు పుణ్య స్నానాలు ఆచరించే భక్తులతో పోటెత్తాయి..

ద్రాక్షారామ



ఘంటాంబిక ఆలయం వద్ద పుష్పాలంకరణ




ఐ.పోలవరం: మురమళ్లలో భక్తుల రద్దీ



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ..



భక్తజనంతో కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం పుష్కరాల రేవు



పాదగయలో జంగమదేవర



పిఠాపురం: పాదగయలో



రాజమహేంద్రవరంలో



సామర్లకోట భీమేశ్వర ఆలయం వద్ద..



పిఠాపురం: పాదగయ వద్ద భక్తజనం

7

సర్వం సిద్ధం!



పట్టభద్రుల నియోజకవర్గంలో నేడే పోలింగ్

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నింటిపై అవగాహన కలిగిన పట్టభద్రులే ఓటర్లుగా ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం ముందస్తుగా ఓటర్లకు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ముందుచూపు ప్రదర్శించారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తారు.

- బ్యాలెట్ పత్రాలు.. బ్యాలెట్ బాక్సుల వినియోగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్
- గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి
- స్వేచ్ఛగా ఓటేయండి.. ఆర్వో, కలెక్టర్ వెట్రిసెల్వి

(ఏలూరు/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో 3 లక్షల 14 వేల 984 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 282 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 66 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ఆరంభమై సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. పోలింగ్ శాతాన్ని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి. వాస్తవానికి ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు 3 లక్షల 14 వేల 984 మంది ఉండగా వీరి నిమిత్తం 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్ కాస్టింగ్ సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి 35 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1080 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద రెండు వేల 714 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఏలూరు జిల్లాకు సంబంధించి 80 మంది పీవో, మరో 80 మంది ఏపీవో, 160 మంది అదనపు సిబ్బంది, 80 మంది అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద 400 మందిని నియమించారు. 70 మంది జోనల్ అధికారులను, 99 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సంబంధించి 1199 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గురువారం పోలింగ్ జరగనుండడంతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి బుధవారం అధికారులతో సమీక్షించారు. ఎక్కడాలోపం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. తగు నివేదికలను సిద్ధం చేసుకోవాలని నిర్దిష్ట ఆదేశాలు జారీ అయ్యాయి. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

అంతా టెన్షన్.. టెన్షన్

మూడు నెలలుగా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులంతా గురువారం తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండడమే కాకుండా ఈసారి ఓటర్ల సంఖ్య ఇదే మాదిరిగా పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల అనుకూలతను బట్టి సుమారు 70 శాతం వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పట్టభద్రుల ఓటర్లను ఒక చోటుకు రప్పించడం అంత సులువైన పనికాదని, ఈ కారణంగానే పోలింగ్ మందకొడిగా సాగడంతోపాటు శాతం తగ్గుముఖం పట్టగలదని ఇంకొంతమంది అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం పోటీలో ఉండడంతో ఆయనకు అనుకూలతలు, బలహీనతలపైనే ఇప్పటివరకు ఎవరంతట వారుగా అంచనాలు వేశారు. తెలుగుదేశం మాత్రం తమ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఇప్పటికే అంచనా వేసింది. ఇంకోవైపు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు సైతం టీడీపీ అభ్యర్థికి గట్టి పోటీని ఇచ్చారు. ప్రచారంలోను ఏ మాత్రం తగ్గకుండా ముందుకే సాగారు. మిగిలిన అభ్యర్థులు నువ్వా నేనా అనే తరుణంలో ప్రచారాస్త్రాలు సంధించారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరి వాదనలు విన్న పట్టభద్రుల ఓటర్లు ఏవైపు మొగ్గు చూపుతారనేదే ఇప్పుడు అందరిలోను టెన్షన్.. టెన్షన్.

మొత్తం అభ్యర్థులు : 35
ఓటర్లు : 3,14,984

బరిలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం, కాట్రు నాగబాబు, షేక్ హుసేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవింద రాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీర రాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్‌రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్ బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విప్పువజ్జుల, జీవీ సుందర్, హసన్ షరీఫ్.

ఓటు వేసేందుకు వెళుతున్నారా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించే వారంతా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఎన్నికల కమిషన్ నిర్దేశించినట్లు తగిన గుర్తింపు కార్డులను అందుబాటులో ఉంచుకుని పోలింగ్ సమయంలో అధికారుల ఎదుట ప్రదర్శించాలి. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, డిపార్టు మెంట్ గుర్తింపుకార్డు, జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకులు, తపాలశాఖలో జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్‌ను ప్రతీ ఓటరు కలిగి ఉండాలి. ముందస్తుగా ఈ తరహా కార్డులు ఉన్నాయో లేదో సరి చూసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి.

మీ ఓటు చెల్లాలంటే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విధానం అందరూ అర్థం, అవగాహన చేసుకోవాలి. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం బ్యాలెట్ పత్రాలను మాత్ర మే పోలింగ్‌లో వినియోగిస్తారు. ఓటర్లకు ఒక బ్యాలెట్ పత్రాన్ని అందిస్తారు. ఈ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయో గించాలి. ప్రాధాన్యత క్రమంలో మీకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి 2, 3, 4 ఈ తరహాలో ఓటు వేయవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే అంకెను(నెంబర్) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే మీ ఓటు చెల్లదు. మరో ముఖ్య విషయమేమిటంటే బ్యాలెట్ పత్రంలో ఇష్టమైన అభ్యర్థికి 1 అంకె వేయకుండా ఆ తదుపరి 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తే అదీ కూడా చెల్లదు. బ్యాలెట్ పేపర్‌లో అంకెలు మాత్రం వేయాలి.



కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో పోలింగ్ సామగ్రి పంపిణీపై ఆరా తీస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి



అమలాపురం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల సరంజామాతో సిద్ధమైన పోలింగ్ సిబ్బంది

'తూర్పు'లో ఓటర్లు.. పోలింగ్ స్టేషన్లు..

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 36,361 మంది, మహిళలు 26,606 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. మొత్తం 92 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 55, కొవ్వూరు డివిజన్‌లో 37 ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని లాలాచెరువులోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 52వ పోలింగ్ స్టేషన్‌లో అత్యధికంగా 1738మంది ఓటర్లు ఉండగా, గోపాలపురం మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్‌లోని టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన 261వ పోలింగ్ స్టేషన్‌లో కేవలం 382 మంది ఓటర్లు ఉండడం గమనార్హం. ఎన్నికల నిర్వహణ కోసం 92 మంది ప్రిసైడింగ్ ఆఫీసరులు, 92 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 204 మందిఇతర పోలింగ్ సిబ్బంది. 102 మంది మైక్రో అబ్జర్వర్లు కలసి మొత్తం 510 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు.



తల్లడిల్లిన 'తాడిపూడి'

ప్రమాదంలో మృతి చెందిన యువకుల ఫ్లెక్సీలతో మిత్రుల నివాళి

7



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

ఇసుక మేటలే అనుకుని... గోతుల్లోకి జారి ఐదుగురు బలి

రాజమహేంద్రవరం/ తాళ్లపూడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఇసుకమేటలే కదా అని ఎక్కువ నీరున్న చోటకు నడుస్తూ లోతైన గోతుల్లోకి జారిపోయి ఐదుగురు విద్యార్థులు జలసమాధి కావడం తాడిపూడి ప్రజలను తీవ్రంగా కలచివేచింది. శివరాత్రి పర్వదినం రోజున పుణ్యస్నానాలకు వెళ్లి తిరిగిరాని లోకాలు ఈ యువకులు వెళ్లిపోవడంతో ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వేసి పెద్ద గోతులు పెట్టడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తుల ప్రధాన ఆరోపణ. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్ (17), తిరుమలశెట్టి పవన్ (19), పడాల దేవదత్తసాయి (18), పడాల రామదుర్గాప్రసాద్ (19), అనిశెట్టి పవన్‌గణేశ్ (17), మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి ఊరికి దగ్గరలో ఉన్న గోదావరిలో ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. ఐదురుగు ముందుగా స్నానానికి వెళ్లగా, మిగతా ఏడుగురు గట్టుమీదే ఉన్నారు. స్నానానికి వెళ్లిన వాళ్లలో ఆకాశ్, దత్తసాయి తొలుత గోదావరిలో ఇసుక మేటలు వేయడంతో ఓ పది అడుగులు ముందుకు వెళ్లి స్నానం చేస్తూ.. కాస్త పక్కన నీళ్లు కొద్దిగా నీలం రంగులో ఉండడం గమనించి అటువెళ్లి గోతిలోకి జారిపోయారు. వారిని రక్షించే ప్రయత్నంలో మరో ముగ్గురు దుర్గాప్రసాద్, తిరుమలశెట్టి పవన్, అనిశెట్టి పవన్ కూడా గోతుల్లోకి జారిపోయారు. ఇందులో తిరుమలశెట్టి అనిల్‌కు ఈతవచ్చు. కానీ ఒకరిని రక్షించబోయి మిగతావారు మునిగిపోయారు. ఇసుక ర్యాంపు కోసం ఒడ్డున పాక వేస్తున్న కూలీలు వీళ్ల కేకలు విని ఊళ్లో వారికి సమాచారం ఇచ్చారు. ప్రతి శివరాత్రి రోజున గ్రామంలో మజ్జిగ పంపిణీ చేస్తుంటారు. బుధవారం కూడా మజ్జిగ సిద్ధం చేస్తున్నారు. మృతుడు తిరుమలశెట్టి పవన్ చిన్నాన్న తిరుమలశెట్టి శ్రీనివాస్ వాళ్లను చూసి మజ్జిగ పంపిణీకి ఇప్పటికే ఆలస్యమైంది, త్వరగా రండి అని చెప్పి ఏర్పాట్లలో ఉండిపోయాడు. గోదావరిలో స్నానం చేసి వచ్చేద్దామని అనుకొని ఈ 12 మంది వెళ్లిపోయారు. ఈలోపు మజ్జిగ పంపిణీ ఏర్పాట్లలో ఉన్న తాను కరివేపాకు కోసం వెళ్లగా 8.10 గంటలకు దుర్వార్త వినాల్సి వచ్చిందంటూ శ్రీనివాస్ విలపించారు. ఇక తాడిపూడిలోని మూడు వీధుల్లోని జనం మధ్య ఏదొక బంధుత్వం ఉంది. బావ కొడుకు, అన్న అల్లుడు, తిరుమలశెట్టి వారింటికి గర్రె వారి అమ్మాయిని కోడలిగా పంపడం.. ఇలా అందరూ బీరకాయపీచు బంధువులే. మృతుల్లోని పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్తసాయి వరుసకు అన్నదమ్ములు. అదే విధంగా మృతుల తల్లిదండ్రులు అందరూ రోజువారీ కూలి పని లేదా చిన్న రైతులుగా ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. తిరుమలశెట్టి పవన్ డిగ్రీ మొదటి ఏడాది, అనిశెట్టి పవన్ గణేశ్ పాలిటెక్నిక్ మూడో ఏడాది, మిగతా ముగ్గురు ఇంటర్ చదువుతున్నారు. పవన్ గణేశ్ తండ్రి నాలుగేళ్ల కిందట మరణించగా తల్లి రామలక్ష్మి తాళ్లపూడిలోని ఓ కళాశాలలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ పవన్‌తోపాటు కూతురు దివ్యనూ చదివిస్తున్నారు. పవన్ మృత్యువాత పడడంతో ఆమెను సముదాయించడం ఎవరి తరం కాలేదు.

నాలుగు గంటల్లో వెలికితీత

సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్ యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. దీంతో చీఫ్ ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణీ సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. పది మంది గజఈతగాళ్లు, ఆరుగురు ఎస్డీఆర్ఎఫ్, ఆరుగురు ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. గాలింపు 8.30 గంటల సమయంలో చేపట్టగా 12.30 గంటలకు చివరి మృతదేహాన్ని వెలికితీశారు. కొవ్వూరు ఫైర్‌మెన్ ఎం.ప్రకాశ్‌బాబు డైవింగ్ సూట్ వేసుకొని నదిలో బాగా లోతుకు వెళ్లారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులతో పనిలేకుండా ఇష్టానుసారం డ్రెడ్జింగ్ చేశారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రమాదం జరిగిన ప్రదేశంలో కూడా నదిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే ఇప్పుడు యువకులు మృత్యువాతపడ్డారు. ఐదో మృతదేహం జాడ 20 అడుగుల లోతులో దొరకడం గమనార్హం. ప్రస్తుతం ఈ గోతులకు పక్కన ఇసుక వెలికి తీస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత ప్రమాదకరమైన గోతులున్నా హెచ్చరికల బోర్డులు లేకపోవడం మరీ దారుణం.

పట్టిసీమకు వెళ్తుండగా..!

- ఆటో బోల్తా.. ఒకరి మృతి.. ఐదుగురికి స్వల్పగాయాలు

7

నేడు పుష్కరాల రేవులో బోట్ రేస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నదీజలాలను పరిరక్షించి రాబోయే తరాలకు నీటిఎద్దడి లేకుండా చేయాలనే సంకల్పంతో జాతీయ జలవనరులశాఖ, జలశక్తి విభాగం, నదీ సంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు నగరంలో నిర్వహిస్తున్న అవగాహనలో భాగంగా గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పుష్కరాల రేవులో బోట్ రేస్ నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయం దగ్గర కాస్మోపాలిటన్ క్లబ్ గోడపై మ్యూరల్ పెయింటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు నీటి సంరక్షణ అంశంపై వై జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకు ఊరేగింపు ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9గంటల వరకు పుష్కరఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. 28న ఉదయం 6 నుంచి 9గంటల వరకు పుష్కరఘాట్ వద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఈఈ షేక్ మదర్షా అలీ నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు కమిషనర్ తెలిపారు.


పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం


రాజమహేంద్రవరం గోదావరి తీరంలో భక్తుల పుణ్యస్నానాలు


ద్రాక్షారామలో భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

హరోంహర

పిఠాపురం

పిఠాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పిఠాపురం పట్టణం భక్తజన సంద్రమైంది. పాదగయ క్షేత్రానికి తరలివచ్చే రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు మంగళవారం అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము సమయానికే పాదగయ బయట కిలోమీటరు మేర భక్తులు వున్నారు. స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తిపీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను, ఇతర ఉపాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి కుక్కుటేశ్వర స్వామి భక్తులకు నిజ రూపంలో దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహనశ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వైద్య శిబిరాల్లో అస్వస్థతకు గురైన పలువురికి వైద్య సేవలు అందించారు. పట్టణంలోని ఉమాసోమేశ్వర స్వామి, సకలేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కోటిపల్లి

కె.గంగవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వేకువజామున గోదావరి నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామివారికి బాలభోగం నివేదించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఛాయాసోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఆలయంలో చాగంటి వంశీయులు నాలుగు తరాలుగా నిర్వహిస్తున్న అఖండ దీపారాధనను కొనసాగించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, ఉత్సవ ప్రత్యేకాధికారి నల్లం చక్రధరరావు, ఆలయ తనిఖీ అధికారి బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో భీమశంకరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను వారు పర్యవేక్షించారు. మాన్సాస్ ట్రస్టు కార్యాలయం వద్ద అన్నదానాన్ని ఉత్సవ ప్రత్యేకాధికారి నల్లం చక్రధరరావు ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం, కాకతీయ సంఘం, శాలివాహన సంఘం, ఫైండా వారి అన్నసత్రంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు నిర్వహించాయి. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


సోమేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



గోదావరిలో రెండు లక్షల మంది పుణ్యస్నానాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి తీరం శివ నామస్మరణతో మార్మోగింది. బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు గోదావరి రేవులకు చేరుకుని హర హర మహాదేవ శంభో శంకర, నమఃశ్శివాయ అంటూ పుణ్యస్నానాలు చేశారు. కోటిలింగాల రేవు, చింతాలమ్మ ఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాల రేవు, మార్కండేయ ఘాట్, టీటీడీ ఘాట్, దోబీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌లు భక్తులతో కిక్కిరిశాయి. సుమారు రెండు లక్షల మంది స్నానాలు ఆచరించారు. మహిళలు కుటుంబీకులతో కలిసి స్నానాలు చేసి గోదావరమ్మకు పసుపు, కుంకుమ సమర్పించారు. ఉమాకోటిలింగేశ్వరాలయం, ఉమా మార్కండేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, ఉమారామలింగేశ్వరాలయం, సర్వేశ్వరాలయం, సారంగధరేశ్వరాలయం, ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం, కల్యాణి సమేత సోమలింగేశ్వరాలయం, బసవ లింగేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పేర్గాంచిన ఉమాకోటిలింగేశ్వర క్షేత్రంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు రథాన్ని లాగుతూ స్వామి, అమ్మవార్లను తిలకిస్తూ భక్తిపారవశ్యం చెందారు.

ద్రాక్షారామ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయం భక్త జనసంద్రమైంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తుల రాక మొదలుకాగా పది గంటలకు తీవ్ర రద్దీ నెలకొంది. వేలాది మంది క్యూలైన్లలో బారులు తీరి భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. శీఘ్ర, విశిష్ట దర్శనాలకే 3-5 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయి. 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ నిర్వహించారు. 12 గంటలకు మహా నివేదన చెల్లించారు. రాత్రి 1.30 గంటల వరకు భక్తులు దర్శించుకున్నారు. చండీ హోమ పండితుడు ఇంద్రగంటి రామారావుశర్మ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. ఉత్సవ అధికారి, దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు పర్యవేక్షణలో, ఈవో అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర ఆలయాల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తెల్లవారుజామున ప్రథమ అభిషేకం, దధీసేవలో పాల్గొన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, టెక్నికల్ ఐజీ శ్రీకాంత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సామర్లకోట

సామర్లకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. మూలవిరాట్‌కు తెల్లవారుజాము నుంచీ ఆలయ పండితుల వేదమంత్రోచ్ఛారణలతో విశేష అభిషేకాలు జరిపారు. ఎండ ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తులు క్యూలైన్లలో నిలుచుని భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లపై కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, అదనపు ఎస్పీ సమీక్షించారు. కోనేరు, గోదావరి, మాండవ్యనారాయణస్వామి ఆలయ పుష్కరిణిల వద్ద తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కెనాల్ రోడ్డు పొడవునా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో పలుమార్లు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తలాటం సూర్యనారాయణ, ఈవో నీలకంఠం ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. భీమేశ్వరుణ్ణి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఆర్డీవో ఎస్.మల్లిబాబు దంపతులు, తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.


ప్రత్యేక అలంకరణలో కుమారరామ భీమేశ్వరస్వామి


ఆదియోగి విగ్రహం లోపలి భాగంలో ప్రతిష్ఠించిన శివలింగం

ఆదియోగి విగ్రహావిష్కరణ

మండపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆదియోగి తొలి భారీ విగ్రహాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో మహా శివరాత్రి పర్వదినాన అశేష భక్తజనం, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బుధవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభించారు. ఆంధ్ర శబరిమల ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. ఆదియోగి విగ్రహం లోపలి భాగంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అయోధ్య బాలరాముడు, వారాహిమాత విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. ఆదియోగి విగ్రహాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, స్థానిక నాయకులు, పలువురు రాజకీయ ప్రముఖులు, భారీ సంఖ్యలో ప్రజలు దర్శించుకున్నారు.


వారాహి మాత విగ్రహం

తాడిపూడి.. శోకసంద్రం!

- తల్లడిల్లిపోయిన కుటుంబ సభ్యులు
- అందరూ చిన్నరైతుల బిడ్డలే


సంఘటనా స్థలంలో బాధతో రోధిస్తున్న మృతుల కుటుంబసభ్యులు


యువకులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన ఐదుగురు మిత్రుల జలసమాధితో గ్రామం యావత్తూ శోకసంద్రంలో మునిగిపోయింది. గోదావరి నదీ తీరంలో కన్న బిడ్డలను పోగొట్టుకున్న కుటుంబాల వారి ఆర్తనాదాలతో, వారి బంధువుల ఓదార్పులతో తల్లడిల్లింది. చనిపోయిన వారి మృతదేహాలను వెతికే సమయంలో జిల్లా కలెక్టరు ప్రశాంతి అక్కడికి విచ్చేసి బాధిత కుటుంబాల వారిని కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి ఆయా కుటుంబాల వారిని ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేలా అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. కాగా మృతుల్లో పడాల సాయి తండ్రి పడాల రాము మాట్లాడుతూ తనకు ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తానని, కొడుకు, కూతురు ఉన్నారని... ఉన్న ఒక్క కొడుకూ చదివి కుటుంబానికి ఆధారంగా ఉంటాడని అనుకుంటే ఇలా అయిపోయిందని రోధించాడు. మరో మృతుడు పడాల దుర్గాప్రసాద్ తండ్రి పడాల వెంకన్నదొర మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తన ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ప్రసాద్ ఐటీఐ చదువుతున్నాడని, చదువు అనంతరం పెద్ద దిక్కుగా ఉంటాడనుకుంటే ఇలా జరిగిం దని వాపోయాడు. గర్రే ఆకాష్ తండ్రి సీతారాముడు మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తనకు ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ఆకాష్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడని, పెద్ద చదువులు చదివి, తమ కుటుంబాన్ని ఆదుకుంటాడనుకుంటే ఘోరం జరిగిపోయిందని విలపించాడు. అనిశెట్టి పవన్ తాత కామిశెట్టి పోసియ్య మాట్లాడుతూ తను వ్యవసాయ కూలీగా జీవిస్తున్నానని, తన అల్లుడు మరణానంతరం తన కూతురు, మనుమడు తన దగ్గరే ఉంటున్నారని, తన కూతురు తాళ్లపూడిలో ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండగా, ఆమెకు ఉన్న ఒక్క కొడుకూ కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కన్నీరుమున్నీరయ్యాడు. తిరుమలశెట్టి పవన్ తండ్రి చిన రంగయ్య మాట్లాడుతూ ఉన్న కొద్దిపాటి పొలంతో పాటు తాను కౌలుకు వ్యవసాయం చేస్తున్నానని, కొడుకు మంచిగా చదివి పెద్ద ఉద్యోగం చేస్తాడనుకుంటే కడతేరిపోయాడంటూ విలపించాడు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి దుర్గేష్

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాడిపూడిలో గోదావరి స్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మృతదేహాలను సందర్శించారు. బంధువుల నుంచి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.పద్మశ్రీరాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్‌ను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాద సంఘటనను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతోపాటు సీఎంవో దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మృతిచెందిన యువకులు జనసేన సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిసిందని, పార్టీ సభ్యత్వం ఉన్నట్టుయితే రూ.5 లక్షలు ప్రమాదబీమా వస్తుందన్నారు. కాగా శవ పంచనామా పూర్తయ్యేవరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో ఉండిపోయారు. సెలవుదినం అయినప్పటికీ ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులు అందరూ అందుబాటులో ఉండి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.


కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి

సహాయం అందేలా చూస్తాం

ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపు వద్ద స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందిన ఘటన బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనపై కలెక్టర్ ప్రశాంతితో ఫోన్‌లో ఆరా తీశారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు సాయం అందేలా చూస్తామన్నారు.

హుషారుగా హాకీ...

12వ రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్


టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ బుధవారం 12వ రోజు హుషారుగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 3 మ్యాచ్‌లు జరిగాయి. సెంట్రల్ సెక్రటేరియట్, ఆర్ఎస్పీ కన్నూర్ పురుషుల క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-1 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్, ఛత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ 4-1 తేడాతో విజయం సాధించింది. డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరునికి సువర్ణ నాగాభరణం బహూకరణ


నాగాభరణం సమర్పిస్తున్న నాగేంద్రరావు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి చెయ్యేరుకు చెందిన త్సవటపల్లి నాగేంద్రరావు 313 గ్రాములు బరువు రూ.25లక్షల విలువైన సువర్ణ నాగాభరణం బహూకరించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో నాగేంద్రరావు, అనంతలక్ష్మీసత్యవతీదేవి దంపతులు స్వామికి నాగాభరణం సమర్పించారు. సంప్రోక్షణ అనంతరం ఆలయ అర్చకులు నాగాభరణాన్ని స్వామికి అలంకరించారు. కార్యక్రమంలో ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, నడింపల్లి సూర్యవర్మ, దాట్ల రామకృష్ణంరాజు, దాట్ల ఇంద్రరాజు, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, కటారి నాని, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారం, నగదు చోరీ

రావులపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం ఆభరణాలు, నగదు అపహరించుకుపోయిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..... లక్ష్మీపోలవరానికి చెందిన దేవగుప్తపు శ్రీనివాసన్ ఈనెల 22న పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం ముప్పర్తిపాడులో జరిగే అమ్మవారి జాతరకు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి 25న రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులోని 30 కాసుల బంగారం ఆభరణాలు, రూ.1.70 లక్షలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో రావులపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎం.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీమ్ పరిశీలించి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు

టీడీపీలోకి మరో వైసీపీ కౌన్సిలర్

తుని రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇప్పటికే 15మంది వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా తాజాగా మరొకరు సైకిల్ ఎక్కేశారు. ఒకటో వార్డు మహిళా కౌన్సిలర్ వారాధి జ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. ఆమెకు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


యనమల సమక్షంలో టీడీపీలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ జ్యోతి

పాదగయ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మహాశివరాత్రి సందర్భంగా అన్నవరం నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రానికి దర్శనం నిమిత్తం ఆటోలో తొమ్మిది మంది ప్రయాణికులు బయలుదేరారు. గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో బి.ప్రత్తిపాడు జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న పార్సిల్ వ్యాన్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తొండంగి మండలం గోపాలపట్టణం గ్రామానికి చెందిన బెక్కం నాగేశ్వరరావు (50), అతడి తల్లి మంగాయమ్మను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మరణించాడు. తీవ్రంగా గాయపడిన అన్నవరం గ్రామానికి చెందిన ఎర్రమిల్లి అఖిలేష్, రాజు, భాగ్యలక్ష్మి విశాఖ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో, బొండు సత్యవతి పిఠాపురం ప్రభుత్వాసుపత్రి, శృంగవృక్షం గ్రామానికి చెందిన అమృతి చంద్రరావు కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రరావు అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఆటో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.


ప్రమాదంలో మరణించిన నాగేశ్వరరావు

పట్టిసీమకు వెళ్తుండగా..!

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

ఐదుగురికి స్వల్పగాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన తూము రమణతో పాటు మరో ఐదుగురు పట్టిసీమ బయలుదేరారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలోని గోదావరి ఏటిగట్టు రోడ్‌లో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమా దంలో తూము రమణ (40) గొంతులో ఇనుప ఊచ దిగిపోవడంతో తీవ్ర రక్త గాయమైంది. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ప్రభుత్వా సుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ భగవాన్‌దాస్ చెప్పారు.


బోల్తాపడిన ఆటో


మరణించిన రమణ (ఫైల్)

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com





బిక్కవోలులో అలంకార రూపంలో ఉన్న గోలింగేశ్వరుడు, కేదారేశ్వరుడు కొమరిపాలెంలో మృత్తిక త్రిముఖ శివలింగం



ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న ఆంజనేయస్వామి కమిటీ, కూటమి నాయకులు

హర హర మహాదేవ.. శంభో శంకర



ధవళేశ్వరం అగస్త్యేశ్వరుడు



అలంకరణలో అమ్మవారు, నాగాభరణంతో స్వామి



కడియపులంకలో అనంతేశ్వరస్వామి, ఆంజనేయస్వామి



పట్టిసం వీరేశ్వరస్వామి, రంగంపేట శ్రీఉమా రామలింగేశ్వరస్వామి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామ గ్రామాన బుధవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఓం నమ:శివాయ, శంకరాయ, మహేశ్వరాయ, హరహరమహాదేవ శంభోశంకర అన్న భక్తుల నామస్మరణలతో శివాలయాలు మార్మోగాయి. దివాన్‌చెరువులో ప్రధానరహదారిని ఆనుకుని ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయంలో గల శ్రీచక్రసహిత ద్వాదశజ్యోతిర్లింగాలయంలోనూ, స్థానిక ఆగమాశ్రమంలో గల కాశీఅన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సంపత్‌నగరంలోని పర్వతవర్ధినీ నాగేశ్వరస్వామి, పాతతుంగపాడు శివాలయంలకు భక్తుల తాకిడి అధికంగా ఉంది. సంపతత్‌నగరంలోని పర్వతవర్ధినీనాగేశ్వరస్వామికి మంగళవారం రాత్రే కల్యాణం నిర్వహించగా, స్థానిక ఆగమాశ్రమంలో ఉన్న కాశీఅన్నపూర్ణ, విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామికి బుధవారం రాత్రి కల్యాణం చేశారు.

వెంకన్నకు మహాపూర్ణాభిషేకం

దివాన్‌చెరువులోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లో ఉన్న శ్రీ భూసమేత అలివేలుమంగ, పద్మావతీ గోదా ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి బుధవారం మహాపూర్ణాభిషేకంను వేద మంత్రాలతో ఆలయప్రధాన అర్చకుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు జరిపించారు.

కడియపులంకలో ఆధ్యాత్మికశోభ

కడియం : వేమగిరి శ్రీపార్వతీసమేత విశ్వేశ్వరస్వామి, కడియం శ్రీభ్రమరాంబికసమేత మల్లేశ్వరస్వామి, మాధవరాయుడుపాలెం భువనేశ్వరీసమేత చంద్ర మౌళీశ్వరస్వామి, కడియపులంక అపర్ణాసమేత అనంతేశ్వరస్వామి, వీరవరం ఉమారామలింగేశ్వరస్వామి, దుళ్ల బాలాత్రిపుర సుందరీ అగస్త్యేశ్వరస్వామి, మురమండ సర్వకామదాంబ సోమేశ్వరస్వామి, జేగురుపాడు నగరేశ్వరస్వామి, పొట్టిలంక పార్వతీ సమేత శివయ్య ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలుజరిగాయి. దుళ్ళలో స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది.

● మాధవరాయుడుపాలెంలో భువనేశ్వరీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి, మాజీ ఎంపీపీ అన్నందేవుల విజయ దంపతులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే గోరంట్ల, ఆలయ స్థల దాత పుల్లా రామారావులు స్వామివారిని దర్శించుకున్నారు. చంటి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గోరంట్లను, ఆలయస్థలదాత పుల్లారామావులను సత్కరించారు.

● కడియంలో శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామి వారిని ఎమ్మెల్యే గోరంట్ల దర్శించుకున్నారు. కూటమి నాయకులు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాదు, ఆకుల శ్రీధర్, నాని, తదితరులు ఉన్నారు. కడియపులంక హరిహర మహాక్షేత్రంలో ఉన్న అపర్ణాసమేత అనంతేశ్వరస్వామిని మంత్రి దు ర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దర్శించుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గోరంట్లకు పరమేశ్వరచిత్రపటాన్ని అందజేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి వజ్రోత్సవ వేడుక

కడియపులంక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా 75వ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయకమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీ పురందేశ్వరిలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వీరిని ఆలయకమిటీ ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు.

● శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
● స్వామిని దర్శించుకున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, నల్లమిల్లి



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న ఆంజనేయస్వామి ఆలయకమిటీ, కూటమి నాయకులు

వెండి నాగాభరణ అలంకరణతో స్వామివారు

ధవళేశ్వరం: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవదాయశాఖ పరిధిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయం, రామపాదాల రేవువద్ద ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, విదాధ్యేర స్వామి వారి ఆలయాలు భక్తులు శివనామస్మర ణతో మార్మోగాయి. బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో తెల్లవారుజా ము నుంచే స్వామి వారికి విశేష అభిషేకాలు ని ర్వహించారు. దర్శనం అనంతరం భక్తులకు ప్ర సాదాలు పంపిణీ చేశారు. అగస్త్యేశ్వరుడికి భక్తు ల సహకారంతో తయారు చేయించిన వెండి నాగాభరణాన్ని బుధవారం పూజలు అనంతరం స్వామివారికి అలంకరించారు.

గోలింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు

బిక్కవోలు: బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామికి లక్షబిల్వార్చన, అభిషేకా లు జరిపారు. అర్ధరాత్రి లింగోద్భవ పూజలు చేశారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన అరపలో దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీపడ్డారు. ఈసందర్భంగా రాత్రి కాల్చిన బాణాసంచా అందర్నీ ఆకట్టుకుంది. లేఖరి గణపతి దంపతులు స్థానిక అన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ అధ్యక్షుడు వంగా రామకృష్ణారెడ్డి, సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, ఆలయ ఈవో ఆకెళ్ల భా స్కర్ పాల్గొన్నారు. మహాశివరాత్రి రోజున పూజలందుకునే కేదారేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కొంకుదురు బుడతలమామిడివద్ద వున్న శ్రీబాలాత్రిపురసుందరి సమే త త్రిముఖలింగేశ్వరస్వామిని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవకమిటీవారు అన్న ప్రసాదాన్ని అందించారు. ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది.

ఆకట్టుకుంటున్న మృత్తిక త్రిముఖ శివలింగం

మహాశివరాత్రి సందర్భంగా కొమరిపాలెంలోని తుల్యభాగ నది తీరాన శ్రీవల్లి దేవ సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో గ్రామానికి చెందిన ప్రముఖ శిల్పి కొల్లి గోవిందు ఆధ్వర్యంలో వర్రి రామకృష్ణ, గండేపల్లి వెంకటరమణ, బండారు సుబ్బారావులు మృత్తిక త్రిముఖ శివలింగాన్ని తయారు చేశారు.

శివనామ స్మరణతో శైవక్షేత్రాలు

రాజానగరం: రాజానగరంలోని పురాత శివాలయం భక్తుల రద్దీతో కిటకిటలా డింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్రీనివాసరావు తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు పలువురు దాతలు అన్నదానం కార్యక్రమాలు, వివిధ రకాలైన ప్రసాద వితరణలు చేశారు. మండలంలోని తూర్పుగోనగూడెంలోని ఉమా శంకరస్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలో చక్రద్వారబంధం, నరేంద్రపురం, కలవచర్ల, సీతారాంపురం, నందరాడ, కానవరం, పల్లకడియం, తోకాడ, రాధేయపాలెం, ముక్కినాడ గ్రామాల్లో శివాలయాలు శివనామ స్మరణతో ప్రతిధ్వనించాయి.

శివ నామస్మరణతో మార్మోగిన ఏటిగట్టు

సీతానగరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం వంగలపూడి, రామచంద్రపురం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు ఏటిగట్టు శివనామస్మరణతో మార్మోగింది. ఏలూరు జిల్లా, పోలవరం మండలం పట్టిసం గ్రామంలో గోదావరి మధ్యలో ఉన్న వీరేశ్వరస్వామిని దర్శించుకోవడానికి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడి, రామచంద్రపురం రేవుల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వెళ్లారు. గోదావరికి అడ్డుకట్టవేసి ఇసుకతో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేశారు. ట్రాక్టరుకు మనిషికి రూ.80 చొప్పున వసూలు చేశారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు. వంగలపూడి వద్ద గోదావరి దాటడానికి ఏర్పాటుచేసిన రోడ్డుతో ప్రయాణం దూరం కావడంతో రామచంద్రపురం గ్రామం నుంచి వెళ్లడానికి మక్కువ చూపడంతో వంగలపూడి నుంచి వెళ్లే భక్తుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది కారుకు రూ.100, బైక్‌లకు రూ.50 చొప్పున వసూలు చేశారు. భక్తులను తరలించే ట్రాక్టర్లకు కమిటీ ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.100 బయట ట్రాక్టర్లకు 1500లు చొప్పున వసూలు చేసి మనిషికి రూ.80లు చొప్పున ప్రయాణ చార్జీలు నిర్ణయించారు

గోకవరం: మండలంలోని పలు గ్రామాలలో మహా శివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అచ్చు తాపురం గ్రామంలో గోకర్ణేశ్వర స్వామికి జలాభిషేకం నిర్వహించారు. మల్లవరంలో ఉన్న పార్వతి సమేత కైలాసనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకవరం, తంటికొండ, కొత్తపల్లి గ్రామాలలో గల శివాల యాలు తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకి టలాడాయి.

అనపర్తి : మండలంలోని పెడపర్తి, పులగుర్త, కుతుకులూరు, అనపర్తి గ్రామాల్లోని శివాలయాలవద్ద స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనపర్తిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాదన నిర్వహించారు. ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త చాట్రాతి రామారావు దంపతులను ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంగల 17 గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో బుధవారం శివన్నామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా వడిశలేరు శివాలయంలో ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. రంగంపేట శ్రీఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మూడురోజుల ఉత్సవాలను అర్చకులు ఘనంగా ప్రారంభించారు. అనంతరం రంగంపేట హైస్కూల్‌కి చెందిన ఎం.సత్యవేణి శిష్యబృందం భ్రమరాంబ, కార్తిక, స్వర్ణలత, సాహితీ,దేవిశ్రీ, యామిని, పూజితల శాస్త్రీయ నృత్యాభినయనం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఎం.సత్యవేణి టీచర్, శిష్యబృందాన్ని ఆలయకమిటీ చైర్మన్ ఉండవిల్లి జానికిరామ సుబ్బారావులను సత్కరించారు.

కోరుకొండలో ఏకాదశ రుద్రాభిషేకాలు

కోరుకొండ: మహాశివరాత్రి సందర్భంగా కోరుకొండ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం,లింగోద్భావ దర్శనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా కణుపూరు కొండపై మల్లికార్జునస్వామికి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి పూజలు చేశారు. మహా కుంబాభిషేకం,కోటి బిల్వార్చన, మహా అన్న సమారాధన కార్యక్రమాలు జరిగాయి. గాదరాడ ఓం శివశక్తిపీఠంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మహాశిరాత్రిని పురస్కరించుకుని బుధవా రం వేకువజామున రాజమహేంద్రవరంలో గోదావరి స్నా నంచేసి అక్కడి నుంచి గోదావరిగట్టు నున్న ఉమామార్కండేయస్వామి ఆలయంలోను, జాంపేట ఉమారామలింగేశ్వరాలయంలోను, కోటిలింగాల క్షేత్రం ఉమాకోటిలింగేశ్వరాలయం లోను, సారంగధారేశ్వరాలయంలోను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. రానున్న గోదావరి పుష్కరాలకు 10 కోట్ల మంది యాత్రికులు వస్తారని భావిస్తున్నప్పటికీ 15కోట్ల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. కుంభమేళ అనుభవంతో గోదావరి పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.



ఉమాకోటిలింగేశ్వరాలయంలో మహాశివుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



అనపర్తిలో ఉమా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి




రాజమహేంద్రవరంలో భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న అనుశ్రీ సత్యనారాయణ, వాసవీ క్లబ్ సభ్యులు



సీతానగరం: వంగలపూడి నుంచి పట్టిసం వెళుతున్న భక్తులు

దారిదోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు కానిస్టేబుళ్లకు రిమాండ్

రాజానగరం, ఫిబ్రవరి 26(ఆంధ్ర జ్యోతి): సమాజంలో శాంతి భద్రతల పరి రక్షణ, దొంగతనాలను నిర్మూలించాల్సిన కొంత మంది పోలీసులు మాతృశాఖకే మాయని మచ్చని తెచ్చిపెడుతున్నారు. విధులను విస్మరిస్తూ దారిదోపిడీయే ప్రధాన ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. గతంలో అనేక మార్లు సహచర పోలీసులు చెప్పినా వినకుండా దారి దోపిడీని ప్రధాన ఆదాయ మార్గంగా ఎంచుకుని, చివరకు కటకటాల పాలయ్యారు. వివరాల్లోకి వెళితే... రాజమహేంద్రవరంలోని మల్లయ్యపేటకు చెందిన కొండా చంద్రబాబు అనే యువకుడు చేపల వ్యాపారం చేస్తుంటాడు. ఈనేపథ్యంలో చేపల సరఫరా నిమిత్తం ఈనెల 24న సాయంత్రం మురారిలోని తన యజమాని అయిన కేవీఆర్ సత్యనారాయణను కలిసేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి వస్తూ మార్గమధ్యలో రాత్రి 8గంటల సమయంలో జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రి దాటిన తర్వాత టీ టైమ్ సమీపంలో బహిర్భూమి నిమిత్తం రోడ్డు పక్కకు వెళ్లాడు. ఈ సమయంలో ఇద్దకు కానిస్టేబుల్స్ యూనిఫారాలతో వచ్చి ఇక్కడ నువ్వు ఏం చేస్తున్నావ్? ఇక్కడ నీకు పనేంటి? అంటూ సదరు యువకుడిని బెదిరింపులకు గురిచేశారు. ఇంతటితో ఆగకుండా బాధితుడి వద్ద నున్న సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని పాస్‌వర్డ్ ఓపెన్ చేయించారు. మొబైల్‌లో ఉన్న రూ.63వేలు నగదు ఉండడం గమనించిన కానిస్టేబుళ్లు ఒక దఫా రూ.20వేలు, మరోసారి రూ.5వేలు నగదును కానిస్టేబుల్స్ మొబైల్‌కు, సమీపంలోని టీ టైంవద్ద స్కానర్‌కు నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఈవిషయం ఎవరికైనా చెబితే ఊరుకోమని బెదిరించారు. అనంతరం బాధితుడు నకిలీ పోలీసులు అనే అనుమానంతో రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై రాజానగరం పోలీసులు సైతం నకిలీ పోలీసులుగా అను మానించి కేసు నమోదుచేసి నిఘా వేయగా అసలు విషయం బయటపడింది. నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న వై.బీ. దొర, జి.సత్యనారాయణ అనే ఇద్దరు ఇటువంటి కానిస్టేబుళ్ల కార్యకలాపాలకు పాల్ప డినట్లుగా నిర్ధారణ అయ్యింది. ఈమేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్.ఐ కె.వెంకటనాగార్జున కేసు నమోదుచేసి కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్‌విధించినట్లు ఎస్.ఐ తెలిపారు.

పోలింగ్‌కి పటిష్ట బందోబస్తు

● రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా: ఎస్పీ నరసింహకిషోర్



పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఎన్నికల విధులపై పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. రౌడీ షీటర్లు, గతంలోని ఎన్నికల కేసుల్లో ఉన్న వాళ్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛగా ఎలాంటి ప్రలోభాలకూ లొంగకుండా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు: గురువారం నిర్వహించే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎన్.సత్యకృష్ణ బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం మీద 1934 మంది పట్టభద్రులు ఉన్నారని వీరిలో పురుషులు 1216, స్త్రీలు 718మంది వున్నారన్నారు. వీరి కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో ఒకటి, తహశీల్దార్ కార్యాలయంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు.

గోకవరం: గోకవరంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక తహశీల్థారు సాయిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల కోసం ఇద్దరు పోలింగ్ అధికారులు, ఇద్దరు అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఇద్దరు మైక్రో అబ్జర్వర్లతోపాటు అదనంగా మరో ఐదుగురు పోలింగ్ సిబ్బందిని నియించామన్నారు. మండలంలో మొత్తం 1577 మంది ఓటర్లువుండగా వారిలో మహిళలు 528మంది ఉన్నారన్నారు.

రాజానగరం: మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. రాజానగరం మండలంలో మొత్తం 2,523 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉండగా, వీరిలో పురుష ఓటర్లు 1,635మంది కాగా, మహిళా ఓటర్లు 887 మంది ఉన్నారన్నారు. ఓటర్లంతా ప్రశాంత వాతావరణంలో సజావుగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

రంగపేట: మండలంలో గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేశామని రంగంపేట తహశీల్దార్ కోసు అనసూయ తెలిపారు. స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో శ్రీఉండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 44, 45 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు పురుషులు 899, మహిళలు 390 మొత్తం 1289 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

అనపర్తి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అనపర్తి మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన అనపర్తిలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనపర్తిలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, నెం 2 ప్రాథమిక పాఠశాలల్లో మూడు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. అనపర్తి మండల పరిధిలో 2358మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వీరికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ చాలా కీలకం

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి గురువారం జరిగే పోలింగ్ ప్రక్రియ చాలా కీలకమని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరంలోని గోరంట్ల కార్యా లయంలో పోలింగ్ బూత్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన, టీడీపీ హెల్త్‌విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరామ్ కిరణ్ గోరంట్లతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ పోలింగ్ సెంటర్‌లో ఓటు వేసేటప్పుడు బ్యాలెట్ పేపరులో క్రమసంఖ్యలో మొదటి అభ్యర్థి అయిన పేరాబత్తుల రాజశేఖరం పేరు పక్కన గల బాక్స్‌లో ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన పెన్‌తో మాత్రమే ఒకటవ నెంబరు వేయాలని పేర్కొన్నారు. బూత్‌లో పోలింగ్ ఏజెంట్లు పాటించాల్సిన నియమాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, కడియం మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం ,రొంపిచర్ల ఆంటోని, శీలం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఊరంతా అన్నదానాలే

● భక్తుల కడుపునింపిన దాతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలో దాతల దాతృత్వంతో మరొక మారు అతిథులు ఉబ్బితబ్బిబయ్యారు. మహాశివరాత్రి సందర్భంగా గోదావరి పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు అల్పాహారం మొదలు కొని భోజనాల వరకు రాజమహేంద్రవరంలో రోడ్డుపక్కన టెంట్‌లు వేసి అందించారు. మల్లయ్యపేట రోడ్డు, పేపరుమిల్లురోడ్డు, సీతంపేట, కృష్ణనగర్ రోడ్డు, కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్‌రోడ్డు, గణేష్‌చౌక్, దానవాయిపేటరోడ్డు, కోటగుమ్మం రోడ్డు, గోదావరిబండ్ రోడ్డు, కోటిపల్లిబస్టాండ్ రోడ్డు, స్టేడియం రోడ్డు, జెండాపంజారోడ్డు, కందకం రోడ్డు ఇలా నగరమంతా పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపార సంస్థలు పులిహోర, ఉప్మా, కిచిడి, మజ్జిగ, టీ, ఐస్‌క్రీమ్‌లు, పుచ్చకాయ ముక్కలను భక్తులకు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం లలితానగర్‌లో రాజమహేంద్రవరం వాసవీక్లబ్, దత్తసాయి కర్రీ పాయింట్, అలంకార్ పూజా కార్నర్‌ల సహకారంతో క్లబ్ అధ్యక్షుడు కారుమూరి మురళీకృష్ణ, ట్రెజరర్ కుమ్మరగుంట్ల లక్ష్మీకాంతం, జోన్ చైర్మన్ రాయపుడి నాగసాయిలక్ష్మి, క్లబ్ సభ్యులు కరుణకుమార్, వక్కలగడ్డ త్రిమూర్తులు, చెక్కత్రినాథ్, బత్తుల సుబ్బారావు, బాలనాగు భాస్కర్, బచ్చు సూరిబాబు, యలమర్తి రమేష్, కుమ్మరగుంట్ల వీరభద్రరావు, కె.సాయి, రాయపూడి వెంకటేశ్వరరావులు వెయ్యిమందికి ప్రసాద వితరణ చేశారు. టీనగర్‌లో రాజమండ్రి పాలు పెరుగు వర్తక సంఘం అధ్యక్షుడు సూరంపూడి పనసయ్య ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కోటిలింగాలపేటలో దుర్గమ్మ ఆలయంవద్ద శ్రీసాయిరత్నం సేవా సమితి వ్యవస్థాపకుడు ఆకుల ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నీలాపు భాస్కరావు రెడ్డి, డాక్టర్ చంద్రగిరి కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో వేలాదిమందికి టమాట ఉప్మా, తాగునీరు అందించారు. పలు డివిజన్లలో జనసేన ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ శివ భక్తులు ప్రసాదాలు వితరణ చేశారు.

అకస్మాత్తుగా యువకుడి మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): లక్ష్మీవారపుపేటకు చెందిన సయ్యద్ అమీర్(21) అదే ప్రాంతంలో పాలిథీన్ కవర్లు తదితర సామగ్రి విక్రయించే షాపులో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం కొన్ని కవర్ల ప్యాకెట్లు దుకాణాలకు ఇవ్వడానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. జెండాపంజా రోడ్‌లోకి వచ్చేసరికి ఒక్కసారిగా బండిపై నుంచి పడిపోయాడు. స్థానికుల సమాచారంతో షాపు యజమాని ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. అయితే గతంలో ప్రేమ వ్యవహారం వికటించి పురుగుల మందు తాగి అమీర్ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడని, అప్పటి నుంచీ నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని దుకాణ యజమాని ద్వారా తెలిసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ అప్పారావు వెల్లడించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

సీతానగరం, ఫిబ్రవరి 26: మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన గుమ్మళ్ళ శ్రావణి 28 బుధవారం సింగవరంలోని అత్తవారింట్లో ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పదేళ్ల క్రితం వివాహమైన మృతురాలు శ్రావణికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, బాధ తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కుటుంబ కలహాలే కారణమని స్థానికుల సమాచారం. మృతురాలికి కోడిగ్రుడ్ల వ్యాపారం చేస్తున్న భర్త దుర్గాప్రసాద్ అత్తమామ ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

గోవుల అక్రమ రవాణా!

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను తరలిస్తున్న లారీని గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మోటుపల్లి సాయిరంగ భాను ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు అడ్డుకున్నారు. విజయనగరం నుంచి కేరళకు కేఏ51 ఏజీ 67 లారీలో గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద నిఘా పెట్టామని భాను తెలిపారు. లారీని సోదా చేయగా గోవులు ఉన్నాయని, బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లారీని, దానిలో అక్రమంగా తరలిస్తున్న 37 గోవులను స్వాధీనం చేసుకున్నారన్నారు. గోవుల అక్రమ రవాణాపై సీఐ పి.కాశీవిశ్వనాథానికి ఫిర్యాదు అందజేశామన్నారు.

పత్రీజీ ధ్యాన జ్ఞాన కార్యక్రమం

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):ప్రతీ మనిషికి ఒత్తిడి తగ్గించేందుకు ధ్యానం ఎంతో అవసరమని, ధ్యానం అనారోగ్యాన్ని దరి చేరకుండా ఉంచుతుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం గౌతమీ ఘాట్ వాకర్స్ అండ్ యోగా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో పత్రీజీ మహిళా చైతన్య కమిటీ నిర్వహించిన ధ్యాన జ్ఞాన మహోత్సవ కార్యక్రమానికి హాజరైన గోరంట్ల మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన కేంద్ర వ్యవస్థాపకులు స్వామి పత్రీజీ జీవన విధానం ఆదర్శమన్నారు.

తెల్లవారుజాము నుంచే ఎస్పీ పర్యవేక్షణ

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): బాస్ ముందుండి సమర్థవంతంగా నడిపిస్తే సిబ్బందిలో ఉత్సాహం ఉరకలు వేస్తుందంటారు. శివరాత్రి రోజున జిల్లా పోలీస్ బాస్ ఎస్పీ నరసింహ కిషోర్ తీరులో అదే కని పించింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు, రేవుల వద్ద బందోబస్తును ఎస్పీ మంగళవారంరాత్రే పరిశీలించి తగు సూచనలు చేశారు. అయినా బుధవారం తెల్లవారుజాము నుంచి బందోబస్తు పర్యవేక్షణకు బయలు దేరారు. నిఘా డ్రోన్లు, సీసీ కెమెరాల పనితీరు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకున్న ప్రత్యేక చర్యలు, ఇంటిగ్రేటెడ్ అవుట్ పోస్టులు, కంట్రోల్ రూం, పార్కింగ్ ప్రదేశాలు, స్నానఘట్టాల్లో కలియదిరుగుతూ సిబ్బందిలో ఉత్సాహం నింపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనా జరగడానికి వీల్లేదని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా విధులతోపాటు ప్రజలకు వీలైనంత సహాయం చేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 27 ఫిబ్రవరి 2025 | 5





మండపేట.. ద్వారపూడిలో ఆదియోగి

పిఠాపురం పాదగయకు తరలివచ్చిన భక్తజనం



భక్తజన సందోహం.. పలికెను శివోహం..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు ఓం నమశ్శివాయ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ శివాలయాలు కిటకిటలాడాయి. పాదగయ, ద్రాక్షారామ, సామర్లకోటకు భక్తజనం తరలివచ్చారు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కరఘాట్లు పుణ్య స్నానాలు ఆచరించే భక్తులతో పోటెత్తాయి..



ద్రాక్షారామ ఘంటాంబిక ఆలయం వద్ద పుష్పాలంకరణ



ఐ.పోలవరం: మురమళ్లలో భక్తుల రద్దీ



భక్తజనంతో కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం పుష్కరాల రేవు

రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ..



పాదగయలో జంగమదేవర



పిఠాపురం: పాదగయలో



రాజమహేంద్రవరంలో



సామర్లకోట భీమేశ్వర ఆలయం వద్ద..



పిఠాపురం: పాదగయ వద్ద భక్తజనం

సర్వం సిద్ధం!



పట్టభద్రుల నియోజకవర్గంలో నేడే పోలింగ్

- బ్యాలెట్ పత్రాలు.. బ్యాలెట్ బాక్సుల వినియోగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్
- గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి
- స్వేచ్ఛగా ఓటేయండి.. ఆర్వో, కలెక్టర్ వెట్రిసెల్వి

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నింటిపై అవగాహన కలిగిన పట్టభద్రులే ఓటర్లుగా ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం ముందస్తుగా ఓటర్లకు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ముందుచూపు ప్రదర్శించారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తారు.

(ఏలూరు/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో 3 లక్షల 14 వేల 984 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 282 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 66 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ఆరంభమై సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. పోలింగ్ శాతాన్ని పర్యవేక్షిం చేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి. వాస్తవానికి ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు 3 లక్షల 14 వేల 984 మంది ఉండగా వీరి నిమిత్తం 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్ కాస్టింగ్ సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి 35 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1080 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద రెండు వేల 714 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఏలూరు జిల్లాకు సంబంధించి 80 మంది పీవో, మరో 80 మంది ఏపీవో, 160 మంది అదనపు సిబ్బంది, 80 మంది అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద 400 మందిని నియమించారు. 70 మంది జోనల్ అధికారులను, 99 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సంబంధించి 1199 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గురువారం పోలింగ్ జరగనుండడంతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి బుధవారం అధికారులతో సమీక్షించారు. ఎక్కడాలోపం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. తగు నివేదికలను సిద్ధం చేసుకోవాలని నిర్దిష్ట ఆదేశాలు జారీ అయ్యాయి. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

అంతా టెన్షన్.. టెన్షన్

మూడు నెలలుగా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులంతా గురువారం తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండడమే కాకుండా ఈసారి ఓటర్ల సంఖ్య ఇదే మాదిరిగా పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల అనుకూలతను బట్టి సుమారు 70 శాతం వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పట్టభద్రుల ఓటర్లను ఒక చోటుకు రప్పించడం అంత సులువైన పనికాదని, ఈ కారణంగానే పోలింగ్ మందకొడిగా సాగడంతోపాటు శాతం తగ్గుముఖం పట్టగలదని ఇంకొంతమంది అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం పోటీలో ఉండడంతో ఆయనకు అనుకూలతలు, బలహీనతలపైనే ఇప్పటివరకు ఎవరంతట వారుగా అంచనాలు వేశారు. తెలుగుదేశం మాత్రం తమ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఇప్పటికే అంచనా వేసింది. ఇంకోవైపు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు సైతం టీడీపీ అభ్యర్థికి గట్టి పోటీని ఇచ్చారు. ప్రచారంలోను ఏ మాత్రం తగ్గకుండా ముందుకే సాగారు. మిగిలిన అభ్యర్థులు నువ్వా నేనా అనే తరుణంలో ప్రచారాస్త్రాలు సంధించారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరి వాదనలు విన్న పట్టభద్రుల ఓటర్లు ఏవైపు మొగ్గు చూపుతారనేదే ఇప్పుడు అందరిలోను టెన్షన్.. టెన్షన్.

మొత్తం అభ్యర్థులు : 35
ఓటర్లు : 3,14,984

బరిలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం, కాట్రు నాగబాబు, షేక్ హుసేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవింద రాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీర రాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్‌రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్ బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్జుల, జీవీ సుందర్, హసన్ షరీఫ్.

ఓటు వేసేందుకు వెళుతున్నారా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించే వారంతా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఎన్నికల కమిషన్ నిర్ధేశించినట్లు తగిన గుర్తింపు కార్డులను అందుబాటులో ఉంచుకుని పోలింగ్ సమయంలో అధికారుల ఎదుట ప్రదర్శించాలి. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, డిపార్టు మెంట్ గుర్తింపుకార్డు, జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకులు, తపాలశాఖలో జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్‌ను ప్రతీ ఓటరు కలిగి ఉండాలి. ముందస్తుగా ఈ తరహా కార్డులు ఉన్నాయో లేదో సరి చూసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి.

మీ ఓటు చెల్లాలంటే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విధానం అందరూ అర్థం, అవగాహన చేసుకోవాలి. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం బ్యాలెట్ పత్రాలను మాత్ర మే పోలింగ్‌లో వినియోగిస్తారు. ఓటర్లకు ఒక బ్యాలెట్ పత్రాన్ని అందిస్తారు. ఈ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయో గించాలి. ప్రాధాన్యత క్రమంలో మీకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి 2, 3, 4 ఈ తరహాలో ఓటు వేయవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే అంకెను(నెంబర్) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే మీ ఓటు చెల్లదు. మరో ముఖ్య విషయమేమిటంటే బ్యాలెట్ పత్రంలో ఇష్టమైన అభ్యర్థికి 1 అంకె వేయకుండా ఆ తదుపరి 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తే అదీ కూడా చెల్లదు. బ్యాలెట్ పేపర్‌లో అంకెలు మాత్రం వేయాలి.



కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో పోలింగ్ సామగ్రి పంపిణీపై ఆరా తీస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి



అమలాపురం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల సరంజామాతో సిద్ధమైన పోలింగ్ సిబ్బంది

'తూర్పు'లో ఓటర్లు.. పోలింగ్ స్టేషన్లు..

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 36,361 మంది, మహిళలు 26,606 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. మొత్తం 92 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 55, కొవ్వూరు డివిజన్‌లో 37 ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని లాలాచెరువులోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 52వ పోలింగ్ స్టేషన్‌లో అత్యధికంగా 1738మంది ఓటర్లు ఉండగా, గోపాలపురం మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్‌లోని టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన 261వ పోలింగ్ స్టేషన్‌లో కేవలం 382 మంది ఓటర్లు ఉండడం గమనార్హం. ఎన్నికల నిర్వహణ కోసం 92 మంది ప్రిసైడింగ్ ఆఫీసరులు, 92 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 204 మందిఇతర పోలింగ్ సిబ్బంది. 102 మంది మైక్రో అబ్జర్వర్లు కలసి మొత్తం 510 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు.

ఆటో బోల్తాపడి.. వ్యక్తి మృతి

- మరో ఐదుగురి ప్రయాణికులకు స్వల్పగాయాలు

8

నేడు పుష్కరాల రేవులో బోట్ రేస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నదీజలాలను పరిరక్షించి రాబోయే తరాలకు నీటిఎద్దడి లేకుండా చేయాలనే సంకల్పంతో జాతీయ జలవనరులశాఖ, జలశక్తి విభాగం, నదీ సంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు నగరంలో నిర్వహిస్తున్న అవగాహనలో భాగంగా గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పుష్కరాల రేవులో బోట్ రేస్ నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయం దగ్గర కాస్మోపాలిటన్ క్లబ్ గోడపై మ్యూరల్ పెయింటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయత్రం 4నుంచి 6 గంటల వరకు నీటి సంరక్షణ అంశంపై వై జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకు ఊరేగింపు ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9గంటల వరకు పుష్కరఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. 28న ఉదయం 6 నుంచి 9గంటల వరకు పుష్కరఘాట్ వద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఈఈ షేక్ మదర్షా అలీ నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు కమిషనర్ తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన యువకుల ఫ్లెక్సీలతో మిత్రుల నివాళి

తల్లడిల్లిన 'తాడిపూడి'



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

8

ఇసుక మేటలే అనుకుని... గోతుల్లోకి జారి ఐదుగురు బలి

రాజమహేంద్రవరం/ తాళ్లపూడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఇసుకమేటలే కదా అని ఎక్కువ నీరున్న చోటకు నడుస్తూ లోతైన గోతుల్లోకి జారిపోయి ఐదుగురు విద్యార్థులు జలసమాధి కావడం తాడిపూడి ప్రజలను తీవ్రంగా కలచివేచింది. శివరాత్రి పర్వదినం రోజున పుణ్యస్నానాలకు వెళ్లి తిరిగిరాని లోకాలు ఈ యువకులు వెళ్లిపోవడంతో ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వేసి పెద్ద గోతులు పెట్టడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తుల ప్రధాన ఆరోపణ. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్ (17), తిరుమలశెట్టి పవన్ (19), పడాల దేవదత్తసాయి (18), పడాల రామదుర్గాప్రసాద్ (19), అనిశెట్టి పవన్‌గణేశ్ (17), మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి ఊరికి దగ్గరలో ఉన్న గోదావరిలో ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. ఐదురుగు ముందుగా స్నానానికి వెళ్లగా, మిగతా ఏడుగురు గట్టుమీదే ఉన్నారు. స్నానానికి వెళ్లిన వాళ్లలో ఆకాశ్, దత్తసాయి తొలుత గోదావరిలో ఇసుక మేటలు వేయడంతో ఓ పది అడుగులు ముందుకు వెళ్లి స్నానం చేస్తూ.. కాస్త పక్కన నీళ్లు కొద్దిగా నీలం రంగులో ఉండడం గమనించి అటువెళ్లి గోతిలోకి జారిపోయారు. వారిని రక్షించే ప్రయత్నంలో మరో ముగ్గురు దుర్గాప్రసాద్, తిరుమలశెట్టి పవన్, అనిశెట్టి పవన్ కూడా గోతుల్లోకి జారిపోయారు. ఇందులో తిరుమలశెట్టి అనిల్‌కు ఈతవచ్చు. కానీ ఒకరిని రక్షించబోయి మిగతావారు మునిగిపోయారు. ఇసుక ర్యాంపు కోసం ఒడ్డున పాక వేస్తున్న కూలీలు వీళ్ల కేకలు విని ఊళ్లో వారికి సమాచారం ఇచ్చారు. ప్రతి శివరాత్రి రోజున గ్రామంలో మజ్జిగ పంపిణీ చేస్తుంటారు. బుధవారం కూడా మజ్జిగ సిద్ధం చేస్తున్నారు. మృతుడు తిరుమలశెట్టి పవన్ చిన్నాన్న తిరుమలశెట్టి శ్రీనివాస్ వాళ్లను చూసి మజ్జిగ పంపిణీకి ఇప్పటికే ఆలస్యమైంది, త్వరగా రండి అని చెప్పి ఏర్పాట్లలో ఉండిపోయాడు. గోదావరిలో స్నానం చేసి వచ్చేద్దామని అనుకొని ఈ 12 మంది వెళ్లిపోయారు. ఈలోపు మజ్జిగ పంపిణీ ఏర్పాట్లలో ఉన్న తాను కరివేపాకు కోసం వెళ్లగా 8.10 గంటలకు దుర్వార్త వినాల్సి వచ్చిందంటూ శ్రీనివాస్ విలపించారు. ఇక తాడిపూడిలోని మూడు వీధుల్లోని జనం మధ్య ఏదొక బంధుత్వం ఉంది. బావ కొడుకు, అన్న అల్లుడు, తిరుమలశెట్టి వారింటికి గర్రె వారి అమ్మాయిని కోడలిగా పంపడం.. ఇలా అందరూ బీరకాయపీచు బంధువులే. మృతుల్లోని పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్తసాయి వరుసకు అన్నదమ్ములు. అదే విధంగా మృతుల తల్లిదండ్రులు అందరూ రోజువారీ కూలి పని లేదా చిన్న రైతులుగా ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. తిరుమలశెట్టి పవన్ డిగ్రీ మొదటి ఏడాది, అనిశెట్టి పవన్ గణేశ్ పాలిటెక్నిక్ మూడో ఏడాది, మిగతా ముగ్గురు ఇంటర్ చదువుతున్నారు. పవన్ గణేశ్ తండ్రి నాలుగేళ్ల కిందట మరణించగా తల్లి రామలక్ష్మి తాళ్లపూడిలోని ఓ కళాశాలలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ పవన్‌తోపాటు కూతురు దివ్యనూ చదివిస్తున్నారు. పవన్ మృత్యువాత పడడంతో ఆమెను సముదాయించడం ఎవరి తరం కాలేదు.

నాలుగు గంటల్లో వెలికితీత

సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్ యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. దీంతో చీఫ్ ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణీ సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. పది మంది గజఈతగాళ్లు, ఆరుగురు ఎస్డీఆర్ఎఫ్, ఆరుగురు ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. గాలింపు 8.30 గంటల సమయంలో చేపట్టగా 12.30 గంటలకు చివరి మృతదేహాన్ని వెలికితీశారు. కొవ్వూరు ఫైర్‌మెన్ ఎం.ప్రకాశ్‌బాబు డైవింగ్ సూట్ వేసుకొని నదిలో బాగా లోతుకు వెళ్లారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులతో పనిలేకుండా ఇష్టానుసారం డ్రెడ్జింగ్ చేశారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రమాదం జరిగిన ప్రదేశంలో కూడా నదిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే ఇప్పుడు యువకులు మృత్యువాతపడ్డారు. ఐదో మృతదేహం జాడ 20 అడుగుల లోతులో దొరకడం గమనార్హం. ప్రస్తుతం ఈ గోతులకు పక్కన ఇసుక వెలికి తీస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత ప్రమాదకరమైన గోతులున్నా హెచ్చరికల బోర్డులు లేకపోవడం మరీ దారుణం.

ధ్యానం ఎంతో అవసరం : గోరంట్ల

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):ప్రతీ మనిషికి ఒత్తిడి తగ్గించేందుకు ధ్యానం ఎంతో అవసరమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం గౌతమీ ఘాట్ వాకర్స్ అండ్ యోగా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో పత్రీజీ మహిళా చైతన్య కమిటీ నిర్వహించిన ధ్యానజ్ఞాన మహోత్సవానికి హాజరైన గోరంట్ల మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన కేంద్ర వ్యవస్థాపకుడు స్వామిపత్రీజీ జీవన విధానం ఆదర్శమన్నారు.

ఉండ్రాజవరంలో ... నాలుగు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక హైస్కూల్‌లో రెండు, నెం.1 పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలో 2651 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1575 మంది పురుషులు, 1076 మంది మహిళలు ఉన్నారు.

హరహర.. మహాదేవ

- మార్మోగిన శివాలయాలు
- పెద్దసంఖ్యలో బారులుతీరిన భక్తులు
- పలుచోట్ల అన్నదానాలు



గోష్పదక్షేత్రంలో సుందరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొవ్వూరు గోష్పదక్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు వేకువజాము నుంచే క్షేత్రానికి చేరుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకుని పంచామృతాభిషేకాలు గావించారు. క్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలపై వేంచేసియున్న శివలింగాలకు గోదావరి జలాలతో అభిషేకాలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతలు పులిహోర, ప్రసాదాలను పంపిణీ చేశారు. అవంతి ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు పాలు, కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వ ర్యంలో పులిహోర, మజ్జిగను అందజేశారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా అడిషనల్ ఎస్పీ ఎల్. అర్జున్ పర్యవేక్షణలో పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ పర్యవేక్షణలో క్షేత్రానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శానిటేషన్ చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మరబోట్లు, గజఈతగాళ్లను నియమించారు. పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో గోష్పాదేశ్వరస్వామి ఆలయం, సుబ్రమణ్య స్నానఘట్టంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, పాతవూరు ఉమా చోడేశ్వర స్వామి ఆలయాలతో పాటు కుమారదేవం, చిడిపి, తోగుమ్మి, దొమ్మేరు, పంగిడి, పెనకనమెట్ట, వేములూరు, వాడపల్లి, మద్దూరులోని శివాలయాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సుమారుగా 60 వేలమందికి పైగా వచ్చిన భక్తులకు దాతలు ప్రసాద వితరనచేశారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని ప్రకృతి రావణబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపం ఎదురుగా సిద్ధ గణపతి ఆధ్వర్యంలో భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు. వేలాదిగా భక్తులు క్షేత్రానికి రావడంతో కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, లాంచీలరేవు నుంచి ఫ్యాక్టరీ రోడ్డు, కోర్టు ప్రాంగణం, గౌతమీనగర్ రోడ్డు నిండిపోయాయి.

నిడదవోలు: పట్టణంలో వేంచేసిన రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీంతో శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము మూడుగంటల నుంచే గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలలో స్వామి వార్లకు అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకోళపు వెంకటేశ్వ రరావు, శ్రీకాకోళపు లక్ష్మీనరసింహశాస్త్రి వేదపండితుల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు గావించారు.

● మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు

దీనిలో భాగంగా ఆలయంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన్ని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, ఆలయ మేనేజర్ నామా సూర్య ప్రకాశరావు, తదితరులు ఘనంగా సత్కరించారు.

● వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ

ఈ సందర్భంగా ఆలయంలో బుధవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సుమారు నాలుగు వేల మందికి పాలు, బిస్కెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఉప్పల సతీష్, కార్యదర్శి పేరూరి నాగరాజు, ట్రెజరర్ కేదారిశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ బచ్చు లక్ష్మణరావు, ఇంటర్నేషనల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరం, కొనిజేటి సురేష్ కుమార్, కొనిజేటి మాల్యాద్రి పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి, గౌరీపట్నం, కురుకూరు, పల్లంట్ల, చిన్నాయిగూడెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాల గావించారు. గౌరీపట్నం శివాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రత్యేక పూజలు చేశారు. ఈయనకు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. గౌరీపట్నంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. దేవరపల్లి ఆదిశంకరాచార్య ధ్యానమందిరంలో విశ్వేశ్వరుడు, సరస్వతి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నల్లజర్ల : మండలంలోని పలు శివాలయాల బుధవారం తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. అనంతపల్లి వేగిలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆలయ పూజారి గూడిరి రమేష్, వేదపండితులు రామగోపాల శర్మ కల్యాణాన్ని జరిపించారు.వలిరెడ్డి సతీష్ దంపతులు పూజాధికాలు చేశారు. గ్రామ పెద్దలు, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పోతవరం శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి వారిని వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పాపా శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.ఘంటావారిగూడెం, నల్లజర్ల, గుండేపల్లిలోనూ వేడుకలు జరిగాయి.

చాగల్లు: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలవలపల్లిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి ఆలయం, చాగల్లు శివాలయం, చిక్కాల, నందిగంపాడు, ఊనగట్ల, చంద్రవరం, దారవరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపాలపురం: మహాశివరాత్రిని చెరుకుమిల్లి, హుకుంపేట, దొండపూడి, జగన్నాథపురం, గోపాలపురం, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఘనంగా నిర్వహించారు.

పెరవలి:మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి. మంత్రి దుర్గేష్ తీపర్రులోని రాజరాజ నరేంద్రస్వామిని, అన్నవరప్పాడులో స్ఫటికదర్శనాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో, కమిటీ సభ్యులు మంత్రిని, శేషారావును శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కుందుల సత్యనారాయణ పదివేల మందికి అన్నసంతర్పణ చేశారు.

ఉండ్రాజవరం: పాలంగిలో రామలింగేశ్వర స్వామివారిని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



మంత్రిని సత్కరిస్తున్న జనసేన నేతలు, ఆలయ అధికారులు



కురుకూరులో ప్రత్యేక అలంకరణలో..



అనంతపల్లిలో వేగిలింగేశ్వర స్వామి వారి కల్యాణం



బ్రాహ్మణగూడెంలో బారులు తీరిన భక్తులు

తాడిపూడి.. శోకసంద్రం!

- తల్లడిల్లిపోయిన కుటుంబ సభ్యులు
- అందరూ చిన్నరైతుల బిడ్డలే



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన ఐదుగురు మిత్రుల జలసమాధితో గ్రామం యావత్తూ శోకసంద్రంలో మునిగిపోయింది. గోదావరి నదీ తీరంలో కన్నబిడ్డలను పోగొట్టుకున్న కుటుంబాల ఆర్తనాదాలతో, వారి బంధువుల ఓదార్పులతో తల్లడిల్లింది. చనిపోయిన వారి మృతదేహాలను వెతికే సమయంలో జిల్లా కలెక్టరు ప్రశాంతి అక్కడికి విచ్చేసి బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి ఆయా కుటుంబాల వారిని ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేలా అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. కాగా మృతుల్లో పడాల సాయి తండ్రి పడాల రాము మాట్లాడుతూ తనకు ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తానని, కొడుకు, కూతురు ఉన్నారని, ఉన్న ఒక్క కొడుకూ చదివి కుటుంబానికి ఆధారంగా ఉంటాడని అనుకుంటే ఇలా అయిపోయిందని రోధించాడు. మరో మృతుడు పడాల దుర్గాప్రసాదు తండ్రి పడాల వెంకన్నదొర మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తన ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ప్రసాద్ ఐటీఐ చదువుతున్నాడని, చదువు అనంతరం పెద్ద దిక్కుగా ఉంటాడనుకుంటే ఇలా జరిగిందని వాపోయారు. గర్రే ఆకాష్ తండ్రి సీతారాముడు మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తనకు ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ఆకాష్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడని, పెద్ద చదువులు చదివి, తమ కుటుంబాన్ని ఆదుకుంటాడనుకుంటే ఘోరం జరిగిపోయిందని విలపించాడు. అనిశెట్టి పవన్ తాత కామిశెట్టి పోసియ్య మాట్లాడుతూ తను వ్యవసాయ కూలీగా జీవిస్తున్నానని, తన అల్లుడు మరణానంతరం తన కూతురు, మనుమడు తన దగ్గరే ఉంటున్నారని, తన కూతురు తాళ్లపూడి ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండగా, ఆమెకు ఉన్న ఒక్క కొడుకూ కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కన్నీరు మున్నీరయ్యారు. తిరుమలశెట్టి పవన్ తండ్రి చిన రంగయ్య మాట్లాడుతూ ఉన్న కొద్దిపాటి పొలంతోపాటు తాను కౌలుకు వ్యవసాయం చేస్తున్నానని, తనకు ఒక కూతురు, కొడుకు అని, కూతురుకు పెళ్లి అయిందని.. కొడుకు మంచిగా చదివి పెద్ద ఉద్యోగం చేస్తాడనుకుంటే కడతేరిపోయాడంటూ విలపించారు.

● బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి దుర్గేష్



మృతదేహాలను పరిశీలిస్తున్న మంత్రి

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : తాడిపూడిలో గోదావరి స్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటనపై రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మె ల్యే టీవీ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మృతదేహాలను సందర్శించారు. బంధువుల నుంచి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.పద్మశ్రీ రాణి, ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్‌ను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాద సంఘటనను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలతో పాటు సీఎంవో దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మృతి చెందిన యువకులు జనసేన సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిసిందని, పార్టీ సభ్యత్వం ఉన్నట్లయితే రూ.5 లక్షలు ప్రమాదబీమా వస్తుందన్నారు. పోయిన ప్రాణాలను తీసుకు రాలేమని, ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ ఈ విషయం ఎంపీ పురందేశ్వరికి తెలియజేశామని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం నుంచే కాకుండా ఎంపీ నిధుల నుంచి సహకారం అందజేస్తామని ఎంపీ పురందేశ్వరి తెలియజేశారన్నారు. కాగా శవపంచనామా పూర్తయ్యే వరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో ఉండిపోయారు. సెలవుదినం అయినప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు అందరూ అందుబాటులో ఉండి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, జనసేన నాయకులు డేగల రామ్‌కుమార్, గంగుమళ్ళ స్వామి, ఎం. వెంకటేశ్వరరావు, సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి, తాడిపూడి గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సహాయం అందేలా చూస్తాం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపు వద్ద స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందిన ఘటన బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనపై కలెక్టర్ ప్రశాంతితో ఫోన్‌లో ఆరా తీశారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని, సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు సహాయం అందేలా చూస్తామని ఆమె పేర్కొన్నారు.

మద్దూరులో ప్రభల ఉత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మద్దూరులో ప్రభల ఉత్సవం ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో వేంచేసియున్న రాజరాజేశ్వరి సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామ సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్ (బాబ్జి) దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులతో పాటు ప్రభల ఉత్సవాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. దారిపొడవునా గ్రామస్థులు బ్రహ్మరథం పట్టి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో కే. మోహనవంశీ, వేద పండితులు పెదపూడి రామకృష్ణ పరమహంస, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం



కృష్ణారావును సన్మానిస్తున్న దృశ్యం

చాగల్లు, ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దేవాలయాలు అభివృద్ధికి దాతల సహకారం చాలా అవసరమని కలవలపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అబ్బూరి సీతారామాంజనేయులు అన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లో స్థిరపడి స్వగ్రామం విచ్చేసిన ముళ్ళపూడి వెంకట కృష్ణారావు స్థానిక వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ. 2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ని గ్రామపెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ముళ్లపూడి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు కొండేపాటి కాశివిశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో భోగేశ్వరుడి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఉమా అనంత భోగేశ్వరస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు పర్యవేక్షణలో ఆలయ కమిటీ సహకారంతో ఉత్సవమూర్తులను గ్రామపురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకులు కాళ్లకూరి రవి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి గ్రామస్థులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వంసిద్ధం



గోపాలపురం హైస్కూల్‌కు చేరుకున్న బ్యాలెట్ పేపర్లు, సిబ్బంది



తాళ్లపూడి హైస్కూల్‌కు చేరుకున్న సిబ్బంది

గోపాలపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వంసిద్ధం చేసినట్టు తహశీల్దార్ అజయ్‌బాబు తెలిపారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గోపాలపురం ఎలిమెంట్రీ స్కూల్‌లో నెంబర్ 259, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నెంబర్లు 260, 261... మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు. మొత్తం 1779 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణ కోసం పీవో, ఏపీవో, ఓపీవోను నియమించామన్నారు.

తాళ్లపూడి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. మండలంలో మొత్తం 1935 మంది ఓటర్లకుగాను మూడు పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఇందులో తాళ్లపూడి జడ్పీ హైస్కూల్లో రెండు , తాళ్లపూడి పంచాయతీ కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికి ఎనిమిది మంది సిబ్బంది చొప్పున వచ్చారు. ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి ఆధ్వర్యంలో ఏఎస్‌వో జోడాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భక్తులకు క్లాత్ కవర్లు అందజేత



వేలివెన్నులో భక్తులకు క్లాత్ కవర్లు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలనే సంకల్పంతో వేలివెన్ను ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు బుధవారం శివరాత్రి సందర్భంగా వేలివెన్నులో ఆలయానికి వచ్చే భక్తులకు క్లాత్ కవర్లు అందజేశారు. ఆలయానికి ప్లాస్టిక్ కవర్లతో పూజాసామగ్రిని తీసుకువచ్చే వారిని నుంచి వాటిని సేకరించి, వారికి క్లాత్ కవర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని ఆయన భక్తులను కోరారు.

ఆటో బోల్తాపడి ... వ్యక్తి మృతి

● మరో ఐదుగురి ప్రయాణికులకు స్వల్పగాయాలు



చిడిపి వద్ద బోల్తాపడిన ఆటో

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. వివరాలివి... మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ సందర్శనార్థం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన తూము రమణతో పాటు మరో ఐదుగురు బయలుదేరారు. చిడిపిలోని గోదావరి ఏటిగట్టు రోడ్డులో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తూము రమణ (40) గొంతులో ఇనుప ఊచ దిగిపోవడంతో తీవ్రరక్తస్రావ మైంది. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ ప్రమా దంలో ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఐదు గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యా యి. సమాచారం తెలిసిన వెంటనే తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కే. భగవాన్‌దాస్ తెలిపారు.

పాలు, మజ్జిగ, అన్న ప్రసాద వితరణ



ప్రక్కిలంకలో వితరణ చేస్తున్న కమిటీ సభ్యులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వెళ్లే భక్తులకు పలుచోట్ల పాలు, మజ్జిగ, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రక్కిలంక భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద యాత్రికులకు, భక్తులకు ఉదయం అల్పాహారం, పిల్లలకు పాలు, మజ్జిగ, అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద కొంతమంది మిత్రులు, బంగారం షాపుల యజమానులు కలిసి సుమారు 5000 మందికి అన్నప్రసాద వితరణ చేపట్టామని తెలిపారు. పర్లి సత్యనారాయణ, చెన్నా శ్రీనివాసరావు, కలిశెట్టి సన్యాసి నాయుడు, రామకృష్ణ, హరికృష్ణ, పసుపులేటి రాజేష్, మేడిశెట్టి సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో పాల్గొనాలి



మాట్లాడుతున్న సబికాకుమారి

దేవరపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మహిళలందరూ విధిగా పాల్గొనాలని మహిళా సంఘం అధ్యక్షురాలు షేక్ సబికాకుమారి అన్నారు. దేవరపల్లిలో షేక్‌సబికా కుమారి ఇంటి వద్ద బుధవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో పలువురు సీపీఐ (ఎంఎల్) పలుపార్టీల సంఘ నాయకుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీల పై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, సైబర్ క్రైమ్‌లు, నేరాలపై పోరాడాలన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారీ సమావేశం జరుపుతున్నట్టు చెప్పారు. సీపీఐ ఎంఎల్ ప్రజా పోరాట సమితి నాయకులు కే.సుందరరావు, సత్యనారాయణ, రేపూరి వెంకన్నబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.